రిచ్‌మండ్ కాలనీ
సమస్యలు పరిష్కరించాలి
- పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ వాసుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రిచ్మండ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పిపిఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధి డి.సుకుమార్, నగర నాయకులు ఎం.నాగరాజు మాట్లాడారు. దాదాపు రూ.50 లక్షలకు పైగా వెచ్చించి భారీ విస్తీర్ణంలో నిర్మించిన మురుగు కాలువ మధ్యలో నిలిపివేయడం వల్ల మురికినీరు నిలిచి కాలనీ ప్రజలు దోమల బెడదతో అనారోగ్యాలకు గురౌతున్నారని అన్నారు. రేడియో స్టేషన్ నుండి రిచ్మండ్ కాలనీ వరకు స్థానిక ప్రజలు వదిలిన 100 అడుగుల రోడ్డు ఎగుడు దిగుడుగా తయారై వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు రోడ్డు వేయడం లేదన్నారు. కాలనీ ఏర్పడి ఆరు సంవత్సరాలు అవుతున్నా వీధిలైట్లు వెలిగించాలనే శ్రద్ధ కూడా చూపడంలేదన్నారు. వెంటనే రిచ్మండ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.శివారెడ్డి ధర్నా వద్దకు వచ్చి మాట్లాడారు. కమిషనర్‌తో చర్చించి కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ చూసి డిప్యూటీ కమిషనర్ మేనేజర్ చిన్న రాముడు సానుభూతి తెలిపారు. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఏ.వెంకటరెడ్డి, ఎన్.పీటర్, బి.అనిల్, నగర నాయకులు ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎస్ఆర్.గౌడు, ఎస్.సెమీయుల్లా పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కాలనీ వాసులు

పంట పొలాలకు నీరివ్వాలి
- లేకపోతే హైవే దిగ్బంధం చేస్తాం - రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

రైతులు సాగు చేసిన పంట పొలాలకు నీరివ్వాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం రాజకీయాలకతీతంగా రైతులు జి.సింగవరం సబ్ స్టేషన్ ముందు మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. ఎలక్ట్రికల్ అధికారులను సబ్ స్టేషన్ నుంచి బయటికి రాకుండా దిబ్బంధించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. కర్నూలు మండలం దుద్యాల, ఆర్.కొంతలపాడు, ఎదురూరు, జి.సింగవరం, నిడ్జూరు గ్రామాల్లో కెసి కెనాల్ ఆయకట్టు కింద వేలాది మంది రైతులు కూరగాయలు, మొక్కజొన్న, వరి, మిర్చి తదితర పంటలను సాగు చేశారని తెలిపారు. కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో నీరు లేవనే పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపి వేసి రైతుల పంట పొలాలకు నీళ్లు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే నీరు వదిలి రైతుల పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కర్నూలు తాలూకా సిఐ శ్రీరామ్, ఎస్ఐలు, కర్నూలు తహశీల్దార్ శివరాముడు జోక్యం చేసుకొని రైతులు శాంతియుతంగా ఉండాలని, సమస్యలను అర్థం చేసుకున్నామని, కలెక్టర్‌తో సంప్రదించి నీరిచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశులు, జి.రామకృష్ణ మాట్లాడారు. ఈఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ వర్షాలు లేక ఎండిపోయాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కెసి కెనాల్ ఆయకట్టు దారులైన జి.సింగవరం, నిడ్జూరు, ఎదురూరు, దుద్యాల, ఆర్.కొంతలపాడు గ్రామాల్లో వేసిన పంటలు ఎండిపోతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, అధికారులదని తెలిపారు. ముందుచూపు లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అధికారులు రైతుల పంట పొలాలను కాపాడేందుకు కనీసం నెల రోజులైనా నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరిచ్చి పంట పొలాలను కాపాడకపోతే నేషనల్ హైవేను రైతులతో కలిసి దిగ్బంధిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అబ్దుల్లా, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణ

రాఘవేంద్రుని సన్నిధిలో మాంతేష్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని కన్నడ సినీ హాస్య నటుడు మాంతేష్ శనివారం దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో సినిమా షూటింగ్‌కు వచ్చిన ఆయన రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మంత్రాలయం చేరుకున్నారు. శ్రీమఠం చేరుకున్న ఆయనకు శ్రీమఠం సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాంతేష్ మాట్లాడారు. ఇప్పటి వరకు సుమారు 30 సినిమాలు చేశానని పేర్కొన్నారు. స్థానిక పాత్రికేయులు వెంకటరాజు ఉన్నారు.

మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలి...
- సిఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతి మండలంలోని ఒక పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విజయవాడ నుంచి కలెక్టర్, జిల్లా ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్నూలు జిల్లా కేంద్రంలో నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు రేషనలజైషన్ చేసి సరి చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రకు సంబంధించి ఈనెల 15 నుంచి జనవరి 26 వరకు ఈ యాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడారు. జిల్లాలో ప్రత్యేకంగా బాల్య వివాహాలను అరికట్టే చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో రెఫరల్ కోసం గుర్తించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి చికిత్స అందించడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇన్‌ఛార్జ్ సిపిఒ భారతి, ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్, డిఎంహెచ్ఒ రామ గిడ్డయ్య, డిఐఒ ప్రవీణ్ కుమార్, డిసిహెచ్ఎస్ మాధవి, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జ్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా, డిఇఒ రంగా రెడ్డి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

8న విద్యాసంస్థల బంద్
- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విశాఖ ఉక్కు రక్షణ, కడప ఉక్కు నిర్మాణం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 8న విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఉద్యమాలతోనే విశాఖ ఉక్కు రక్షణ, కడప ఉక్కు నిర్మాణం సాధ్యమని తెలిపారు. శనివారం నగరంలోని కెవిఆర్, సిల్వర్ జూబ్లీ కళాశాలలో విద్యార్థి, యువజన సంఘాల సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా, సోమన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రఫీ మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న దీక్షలు వెయ్యి రోజులు పూర్తవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8న విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తు తరం మంచి ఉద్యోగం కావాలంటే ప్రభుత్వ రంగ సంస్థలైన ఉక్కు ఫ్యాక్టరీలు, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, ఇండియన్ ఆర్మీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ చేతిలోకి వెళితే దేశ అభివృద్ధిలోనూ తీవ్రమైన అనర్థాలు ఏర్పడతాయని తెలిపారు. రాష్ట్రం విడిపోయినప్పుడు పరిశ్రమలన్నీ హైదరాబాదులో ఉండిపోవడంతో ఆంధ్రప్రదేశ్ భారీగా నష్టపోయిందని చెప్పారు. అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా కడప ఉక్కు పరిశ్రమ, ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు, విభజన హామీ ఇచ్చారని తెలిపారు. హామీల అమలులో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేసినా ఏ మాత్రం చలనం లేకుండా గుడ్డిగా కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా మద్దతునిస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కడప ఉక్కు నిర్మాణంపై, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై పోరాటానికి, విద్యార్థి, యువజన తలపెట్టిన బంద్‌లో పాల్గొని మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి, ఉదయ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో విజయవంతంగా సాగింది. రెండు రోజుల పాటు జిల్లాలో బస్సు యాత్ర సాగింది. తొలి రోజు కర్నూలు జిల్లాలో, రెండో రోజు నంద్యాల జిల్లాలో బస్సు యాత్ర నిర్వహించారు. తొలి రోజు కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమైన యాత్ర ఆలూరు, పత్తికొండ, కోడుమూరు మీదుగా కర్నూలు వరకు సాగింది. కర్నూలులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. బస్సు యాత్రను సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే జెండా ఊపి ప్రారంభించారు. రెండో రోజు కర్నూలు నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర నందికొట్కూరు, ఆత్మకూరు, నంద్యాల మీదుగా కడప జిల్లాలోకి ప్రవేశించింది. బస్సు యాత్ర బృందానికి ఊరూరా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బస్సు యాత్ర బృందానికి పలువురు వినతిపత్రాలు సమర్పించారు. నందికొట్కూరు బిఆర్ఆర్‌లో కొట్టాలు వేసుకున్న గుడిసె వాసులకు పట్టాలు ఇప్పించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. మిడుతూరు మండలంలో భూమి పట్టాలు ఇచ్చారు.. కానీ భూములను చూపించాలని, నందికొట్కూరు మున్సిపాలిటీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. అంగన్వాడీ, ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, డప్పు కళాకారులకు గుర్తింపు కార్డు, రూ.5వేల పింఛన్ ఇవ్వాలని వినతి పత్రాలు సమర్పించారు.

ప్రాజెక్టుల్లోకి చేరని నీరు..

జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరడం లేదు. ఎగువన వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం జలాశయానికి చుక్క నీరు కూడా రావడం లేదు. అలాగే తుంగభద్ర జలాశయానికి కూడా ఎగువ నుంచి నీరు వచ్చి చేరడం లేదు.

విద్యారంగ సమస్యలపై...

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 8న విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలను విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఆయా సంఘాల నాయకులు సమావేశాలు నిర్వహించారు.

అవీ..ఇవీ..అన్నీ..

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. వాల్మీకికి నివాళులర్పించారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో టిడిపి ఆధ్వర్యంలో కళ్లు తెరిపిద్దాం కార్యక్రమం చేపట్టారు. టిడిపి, జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం పట్ల టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం తక్కువ సంఖ్యలో కరువు మండలాలను ప్రకటించడంపై పలు సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. కరువు మండలాలను పునః పరిశీలించాలని కోరు తున్నారు. జిల్లావ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు.

గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధాకర్

సి.బెళగల్‌లో 'గడప గడప' ప్రారంభం

ప్రజాశక్తి - సి బెళగల్ : సి.బెళగల్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అధికారులు, నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొని ప్రజలకు అవసరమైన సేవలు అందించాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా శ్రద్ధచూపాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ వైసిపిని గెలిపించుకోవాలని, అందుకు పాటు పడాలని నాయకులను, కార్యకర్తలను కోరారు.

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం
- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శనివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రకటించిన 6 భవిష్యత్తు గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డి రామాంజనేయులు, దొడ్డిపాడు గ్రామ నాయకులు మహబూబ్ బాషా, దనుంజయుడు, టి రాజు, ఖాసిం, షుకుర్, రాజు, రామకృష్ణ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కే పార్వతమ్మ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆకెపోగు వెంకట స్వామి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, పెద్దటేకూరు వెంకటప్ప, తరుణ్ కుమార్ రెడ్డి, లక్ష్మీపురం రాధాకృష్ణ రెడ్డి, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

బతకాలంటే ఊరు విడవాల్సిందే...
- పత్తికొండ మండలం నుండి 100 కుటుంబాలు తెలంగాణకు వలస

ప్రజాశక్తి - పత్తికొండ

'బతకాలంటే పుట్టిన ఊరును విడిచి పెట్టాల్సిందే... పుట్టిన ఊరులో చేయడానికి పనులు లేవు. కరువుతో పంటలన్నీ ఎండిపోయాయి. పొలాల్లో చేయడానికి ఎలాంటి పనులు లేవు. ఇక్కడే ఉంటే ఒక్క పూట తిండి కూడా దొరకదు.. కుటుంబానికి పిడికెడు అన్నం కూడా పెట్టలేకపోతున్నాం... కుటుంబాన్ని పోషించుకోవాలంటే వలస వెళ్లాల్సిందే.. తెలంగాణకు వలస పోతున్నాం...' అని పత్తికొండకు చెందిన వలస వెళ్తున్న కుటుంబ పెద్ద ఆవేదన వ్యక్తం చేశాడు.

పత్తికొండ మండలంలోని పత్తికొండ, చందోలి, హోసూరు, జూటూరు, పుచ్చకాలయమాడ, పెద్ద హుల్తీ, చిన్న హుల్తీ తదితర గ్రామాల నుంచి శనివారం దాదాపు 100 కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలకు వలస వెళ్లాయి. ఉన్న ఊళ్లో పనులు లేక ఉపాధి కూలీలు వలస బాటలు పడుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లో వేసిన పంటలు చేతికి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చేందుకు చిన్న, సన్న కారు రైతులు కూడా పిల్లాపాపలతో కలిసి సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పత్తి తీసేందుకు కిలో పది రూపాయలు ఇస్తుండడంతో గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కూలీలు వలస వెళ్తున్నారు. మండలంలో ఉపాధి పనులు కల్పించాల్సిన అధికారులు మొఖం చాటేస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో పర్యటించి ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

పిల్లాపాపలతో కలిసి వలస వెళ్తున్న కుటుంబాలు

ఇంటికి తాళాలు వేసి వెళ్తున్నాం..

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు పత్తి తీసేందుకు పిల్లాపాపలను తీసుకొని ఇంటికి తాళాలు వేసి వెళ్తున్నా. ఇక్కడ వేసిన పంటలు ఎండిపోవడంతో సాగు కోసం చేసిన అప్పులే మిగిలాయి. అప్పులు తీర్చాలన్నా, కుటుంబం గడవాలన్నా వలస వెళ్లాల్సిందే..

- చాకలి పులికొండ, హోసూరు గ్రామం.

తైక్వాండోలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి
- కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్ తైక్వాండో కోచ్ కె.కార్తికేయన్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించి పతకాలు సాధించాలని సాయి కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్ తైక్వాండో కోచ్ కె.కార్తికేయన్ ఆకాంక్షించారు. కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్ తైక్వాండో కోచ్‌గా కె.కార్తికేయన్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం కర్నూలు నగరంలోని అవుట్ డోర్ స్టేడియంలో ఆయనను తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి పోటీలలో అండర్-17 బాలికల విభాగంలో డి.సుగంధిని, బాలుర విభాగంలో ఎస్.పవన్, డి.రేవంత్, అండర్-19 బాలికల విభాగంలో రాధిక బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కె.కార్తికేయన్, ప్రజాశక్తి హెడ్ ఆఫీస్ జనరల్ మేనేజర్ తిరుపాల్ రెడ్డి, కర్నూలు జనరల్ మేనేజర్ నరసింహ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆత్మరక్షణకు తైక్వాండో విద్య ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. శారీరక, మానసిక ఒత్తిడికి లోను కాకుండా తోడ్పడుతుందని, విద్య, ఉద్యోగాలలో తోడ్పడుతుందని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను, తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్‌ను వారు అభినందించారు. కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ మాట్లాడుతూ కడప జిల్లా రైల్వే కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 9, 10, 11వ తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ క్రీడాకారుడు కపిల్, విద్యార్థుల తల్లిదండ్రులు డి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కె.కార్తికేయన్, తిరుపాల్ రెడ్డి తదితరులు

అవినీతిపై ప్రతి పౌరుడూ పోరాడాలి
- ఎసిబి ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్ రావు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అవినీతికి వ్యతిరేకంగా ప్రతి పౌరుడు పోరాడాలని, నేటి విద్యార్థులే రేపటి పౌరులని, లంచం అడిగితే ఎందుకివ్వాలని ప్రశ్నించాలని ఎసిబి ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్ రావు తెలిపారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలలో భాగంగా శనివారం కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులకు, విద్యార్థులకు అవినీతి నిరోధక చట్టాలపై ఎసిబి అధికారులు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు అవినీతి నిర్మూలనలో భాగం కావాలన్నారు. ఎసిబి కేసులలో దొరికిన వారిని సమాజం చిన్నచూపు చూస్తుందన్నారు. అందరితో అవినీతికి వ్యతిరేకంగా పోరాడతామని ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నీతి మార్గంలో పయనించాలని, అవినీతి కరోనా కన్నా ప్రమాదకరమైన జబ్బుగా అభివర్ణించారు. ఎసిబి ఇన్స్పెక్టర్లు కృష్ణయ్య, ఇంతియాజ్ బాషా అవినీతి నిరోధక చట్టాల పట్ల అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నెంబరు 14400 లేదా14400 మొబైల్ ఆప్ ద్వారా ఫిర్యాదులు ఆడియో, వీడియో సాక్ష్యాలతో సహా అప్లోడ్ చేస్తే ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిబి ఎస్సై మహబూబ్ బాషా, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో భారీగా నిలిచిన వర్షపు నీరు

కర్నూలు నగరంలో భారీ వర్షం
- లక్ష్మీనగర్ వీధులు జలమయం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు వర్షం కురిసింది. వర్షం భారీగా కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైయినేజీ కాల్వల నీరు రోడ్డు మీదకు చేరి ప్రవహించింది. లోతట్టు కాలనీల్లోని వీధుల్లో వర్షపు నీరు చేరింది. లక్ష్మీనగర్ చివరి వీధుల్లో రెండు అడుగుల నుండి నాలుగు అడుగులు ఎత్తున వర్షం నీరు నిలిచింది. 24వ వార్డులో డ్రైనేజీ లెవలింగ్, లైనింగ్ లేదని, ఇప్పటి నుంచి వేసే వాటినైనా లెవలింగ్, లైనింగ్ వేయాలని చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదని సిపిఎం వార్డు కమిటీ నాయకులు తెలిపారు. కార్పొరేటర్ పదవిని వెలగబెట్టిన అధికార, ప్రతిపక్ష పార్టీల వారు అధికార మత్తులో నిద్రపోవటమే పనిగా ఉందని విమర్శించారు. గతంలో సిపిఎం ఎమ్మెల్యేగా ఉన్న ఎంఎ గఫుర్ మాత్రమే నగరానికి, వార్డుకు సంబంధించి అనేక సూచనలు, సలహాలు ఇచ్చారని, కొన్ని పరిష్కరించారు తప్ప మిగతా వాటిని పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు నిస్వార్థంగా పని చేసే వారిని ఆదరించాలని కోరారు.

సచివాలయం, ఆర్‌బికెలు ప్రారంభం

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామంలో రూ. 38.30 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రూ.23.40 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, పంచాయతీరాజ్ అధికారులు, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

చిప్పగిరిలోని అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

ఎబిసికి నీటిని విడుదల చేయాలి

- మండల ప్రజల ధర్నా

ప్రజాశక్తి - చిప్పగిరి

తాగునీటి సమస్య జఠిలం కాకుండా తుంగభద్ర జలాశయం నుంచి ఆలూరు బ్రాంచి కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, దేగలపాడు సర్పంచి నీలకంఠ ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజలు శనివారం చిప్పగిరిలోని బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. సాగు చేసిన పంటలకు, తాగేందుకు నీటికి వెంటనే విడుదల చేయాలని ప్రజలు దాదాపు 3 గంటలు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఆలూరు, గుంతకల్లు రోడ్డుకిరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. వైసిపి కన్వీనర్ మారయ్య, సర్పంచి నీలకంఠ మాట్లాడారు. ప్రజలకు తాగునీటి సమస్య ఎదురవకుండా ఇరిగేషన్ అధికారులు చొరవ తీసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. నీటిని సమస్యను పట్టించుకోకపోతే పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. నిరసన గురించి మంత్రి గుమ్మనూరు జయరామ్ దృష్టికి వెళ్లడంతో వెంటనే మంత్రి జయరామ్ హంద్రీనీవా నుంచి ఎల్ఎల్‌సి కాలువకు సోమవారం నుంచి నీటిని విడుదల చేయిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు, ప్రజలు ధర్నాను విరమించారు. కో ఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్, లాలూ స్వామి, సేనాపతి, జూటూరు లింగన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు

- చెక్కు అందజేసిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు చాకలి తాయప్ప కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రైల్వే శాఖ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసింది. కోసిగి మండలం అగసనూర్ గ్రామానికి చెందిన చాకలి తాయప్ప రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జరిగిన ఘోరాన్ని తలచుకొని బాధ పడవద్దని హితవు పలికారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

హనవాల్ ప్రభుత్వ పాఠశాలలో

9, 10వ తరగతులు నిర్వహించాలి

- ఎంఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని హనవాల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 9, 10వ తరగతులు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఎంఇఒ శివరాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 9, 10వ తరగతులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు చదువుకు దూరమైన పరిస్థితి ఉందని తెలిపారు. అధికారులు స్పందించి 9, 10వ తరగతులు నిర్వహించాలని కోరారు. ప్రతేడాది 8వ తరగతి పూర్తి చేసే విద్యార్థులు వంద మందికి పైగా ఉంటున్నారని తెలిపారు. వారు ఉన్నత చదువులు చదవాలంటే తరగతి లేక వేరే గ్రామానికి వెళ్లి చదువుకోవాలంటే సరైన రవాణా సౌకర్యం లేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని చెప్పారు. వెంటనే స్పందించి 9, 10వ తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి తల్లిదండ్రులను కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ కుమార్, దినేష్, నాగరాజు, రవితేజ, రాజు, గణేష్, శశి, మౌనేష్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా నిరు పేదలకు ఆసరా

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

వైఎస్ఆర్ బీమా నిరుపేద కుటుంబాలకు ఆసరా అని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన గార్లదిన్నె నాగప్ప కోడలు గార్లదిన్నె లక్ష్మి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచి భీమయ్య వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సహాయం రూ.10 వేలు అందజేశారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వెల్ఫేర్ అనిత, వాలంటీర్ దస్తగిరమ్మ మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదు అందించారు. మిగిలిన నగదును నామినీ ఖాతాలో జమ చేస్తామని సర్పంచి భీమయ్య తెలిపారు. అంతకు ముందు సర్పంచి భీమయ్య గార్లదిన్నె లక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపిటిసి గోసిభట్ల వీరేష్, వార్డు సభ్యులు మిడిగిలిదిన్నె రామాంజనేయులు ఉన్నారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమం

- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమించాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. శనివారం ఆదోనిలోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి తిరుమలేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్ బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శీను, పిడిఎస్‌యు జిల్లా కోశాధికారి సోమశేఖర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్, ఐసా డివిజన్ కార్యదర్శి అనిల్, డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ మాట్లాడారు. 32 మంది విద్యార్థి, యువజనుల ప్రాణత్యాగాలతో ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. ఈనెల 8 నాటికి కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు 1000 రోజులకు చేరుకుంటున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఎలా ప్రయివేటీకరణ చేస్తారని ప్రశ్నించారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీతోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈనెల 8న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, పిడిఎస్ఒ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, శివ, ఎఐఎస్ఎఫ్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లికార్జున, బిడిఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి సుభాష్ పాల్గొన్నారు.

ఆదోనిలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు

ఆస్పరి : విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ ఈనెల 8న చేపట్టే బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి కోరారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన విద్యార్థి, యువజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లాభాలు వస్తున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి, జనసేన మండల అధ్యక్షులు అరవింద్, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శులు ఈశ్వర్, రవి, టిఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు సిద్ధు పాల్గొన్నారు.

ఆస్పరిలో మాట్లాడుతున్న నాయకులు

రీసర్వేలోనూ సమస్యలు

పరిష్కరించకపోతే ఎలా..?

- బాధితురాలు భాగ్యమ్మ

ప్రజాశక్తి - నందవరం

పొలాన్ని చూపిస్తున్న భాగ్యమ్మ

రీసర్వేలోనూ పొలం సమస్యలు పరిష్కరించకపోతే ఎలా అని బాధితురాలు ఎస్.భాగ్యమ్మ శనివారం ప్రశ్నించారు. ఆమె వివరాల మేరకు... టి.సోమలగూడురు గ్రామానికి చెందిన కీర్తిశేషులు దేవదానం భార్య ఎస్.భాగ్యమ్మ ఇదే గ్రామానికి చెందిన పెద్దింటి అయ్యన్న దగ్గర రాయచోటి గ్రామ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 138/బి- 2 ఎకరాలు, 138/సి 3 ఎకరాల పొలాన్ని 2005లో కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం, ఇసి ప్రకారం తహశీల్దార్ కార్యాలయ రెవెన్యూ రికార్డులు, అడంగల్, ఆర్ఒఆర్ రికార్డుల ప్రకారం భాగ్యమ్మ అనుభవంలో ఉన్నారు. మండల సర్వేయర్ భూమిని కొలిచి ఎంజాయ్‌మెంట్ ఇచ్చారు. గురజాల గ్రామానికి చెందిన చిన్న లక్ష్మన్న కుమారుడు కురవ లాడేల రామకృష్ణ 15 ఏళ్ల క్రితం భాగ్యమ్మ భర్త దగ్గర పొలాన్ని గుత్తకు తీసుకుని సాగు చేశారు. ఇప్పుడు రామకృష్ణ కుటుంబ సభ్యులందరూ కలిసి పొలంలోకి పోకుండా చేస్తున్నారు. వారి దగ్గర ఎలాంటి ఆధారాలూ లేకపోయినా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. పొలం భాగ్యమ్మదే అని తహశీల్దార్ చెప్పినా వినకుండా పొలాన్ని విడిచి పెట్టలేదు. ఇప్పుడు రీసర్వేలోనూ పొలం సమస్యను పరిష్కరించకుండా కల్లబొల్లి మాటలు చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా భాగ్యమ్మ పొలాన్ని అధికారులు అప్పగించాలని, లేకపోతే భాగ్యమ్మ తరపున పోరాటం చేస్తామని ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు నాగేష్ మాదిగ, గుండుపోగుల రంగన్న, జయరాజ్, రంగన్న, పరిగెల కృపయ్య హెచ్చరించారు.

'నేషనల్'పై చర్యలు తీసుకోవాలి

- ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలులో నేషనల్ ఒకేషనల్ కళాశాల పేరుతో అనుమితి తీసుకొని కర్నూలులో కాకుండా ఎమ్మిగనూరులో నేషనల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల పేరుతో నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. శనివారం ఆర్ఐఒ గురువయ్యశెట్టికి వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ మాట్లాడారు. ఎలాంటి అనుమతి లేకుండా ఎమ్మిగనూరులో కళాశాలను నిర్వహిస్తున్న నేషనల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. సరైన ల్యాబ్‌లు, తరగతి గదులు, మరుగుదొడ్లు కూడా లేవన్నారు. కళాశాల మొత్తానికి కలిపి ఒక బాత్‌రూము ఉందని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేషనల్ ఒకేషనల్ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవి పాల్గొన్నారు.

భారీ సెక్స్ రాకెట్ ముఠా గుట్టు రట్టు

- 8 మంది విటులు, ఇద్దరు నిర్వాహకుల అరెస్టు

- రూ.11,200 నగదు రెండు సెల్ ఫోన్లు సీజ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న భారీ సక్సెస్ రాకెట్ గుట్టును ఆదోని త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. పట్టణంలోని త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని భారీ సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్న వారిపై త్రీ టౌన్ పోలీసులు దాడులు చేసినట్లు త్రీ టౌన్ సిఐ నరసింహ రాజు శనివారం తెలిపారు. సమాచారం మేరకు ఎస్పీ, ఆదోని, డీఎస్పీల ఆదేశాల మేరకు ఆదోని ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది కలిసి దాడులు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో 8 మంది విటులను, నిర్వాహకులైన ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే విటులుగా గుర్తించిన ఆదోనికి, ఎమ్మిగనూరుకు చెందిన వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.11,200 నగదు, రెండు సెల్ ఫోన్లు, కండోమ్స్ సీజ్ చేసినట్లు తెలిపారు. కొంతమంది కళాశాల అమ్మాయిలను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టి వారి స్వస్థలాలకు తరలించినట్లు వివరించారు. అమ్మాయిలు ఇతర రాష్ట్రాల నుంచి పిలిపించి భారీ సెక్స్ రాకెట్ నడుపుతున్నారన్న సమాచారం మేరకు త్రీటౌన్ పోలీసులు దాడులు చేసినట్లు తెలిపారు. ఇద్దరు నిర్వాహకులను విచారణ చేపట్టగా కర్నూలు, కోల్‌కతా, బెంగళూరు, ధర్మవరం, హైదరాబాద్ తదితర రాష్ట్రాల నుంచి అమ్మాయిలను పిలిపించి సెక్స్ రాకెట్ నడిపిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

- తహశీల్దార్ మల్లికార్జున స్వామి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో నిర్వహించే ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపారు. శనివారం గూళ్యం గ్రామంలో ఓటరు జాబితాలో సవరణ, మార్పులు, చేర్పులు ఓటరు జాబితాను తహశీల్దార్ మల్లికార్జున స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 బిఎల్ఒలకు అందజేయాలని తెలిపారు. గ్రామాల్లో బిఎల్ఒలు అందుబాటులో ఉంటారని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేదో సరి చూసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం విడుదల చేసిన ఓటరు ముసాయిదాపై అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా బిఎల్ఒలకు సమర్పించాలని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్బారాయుడు, మహిళా సంరక్షకులు శ్రీదేవి, శాంతి పాల్గొన్నారు.

విద్యలో మార్పులు సమాజానికి ఉపయోగకరంగా ఉండాలి

- విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామశేషయ్య

ప్రజాశక్తి - ఆదోని

విద్యలో మార్పులు రావాలని, అది సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామశేషయ్య, ఎఐఎస్ఇసి జిల్లా కార్యదర్శి వి.హరీష్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం జాతీయ విద్యా విధానంపై అనంతపురంలో 9న జరిగే 2వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేవ్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ కరపత్రాలను ఆదోనిలోని ఓ డిగ్రీ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాభిప్రాయాన్ని, క్షేత్రస్థాయిలోని పరిస్థితులను గమనించకుండా ఏకపక్షంగా జాతీయ నూతన విద్యా విధానం, నాలుగేళ్ల డిగ్రీని ప్రవేశపెట్టడం అప్రజాస్వామికమని తెలిపారు. ఇది మొత్తం ఉన్నత విద్య మౌలిక సూత్రాలను దెబ్బతీసేలా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ దేశవ్యాప్తంగా అనేక సభలు, సమావేశాలు, సెమినార్లు, ర్యాలీలు, నిరసనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలో మేధావులు, ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సభ్యులు మల్లేష్, మన్నెం, అరుణ్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

- అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పాలస్తీనా, గాజాపై జరుగుతున్న దాడులను పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని అఖిలపక్ష నాయకులు, మతాల పెద్దలు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతుగా చర్యలు తీసుకోవాలని, ప్రపంచంలో శాంతి నెలకొల్పే విధంగా అందరూ కృషి చేయాలని తెలిపారు. శనివారం ఆదోని ఖాజీ సాబ్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ జైన్ మాట్లాడారు. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో ఆ రెండు దేశాలు ఎంతగానో నష్టపోయాయని తెలిపారు. నేడు జరుగుతున్న ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం వల్ల అక్కడి ప్రజలు ఎంతో మంది చనిపోతున్నారని, అమాయకులు నష్టపోయారని చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధం ఆపేందుకు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. పాస్టర్ డేనియల్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... రక్తపాతం వల్ల సాధించేది ఏమీ లేదని తెలిపారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో జరిగిన యుద్ధాలు న్యాయపరంగా జరిగేవని, నేడు ఆధిపత్యం కోసం, హక్కులు కాల రాసేందుకు జరుగుతున్నాయని తెలిపారు. యుద్ధాల వల్ల మానవాళి సర్వనాశనం అవుతుందని, ఇప్పటికైనా యుద్ధాన్ని ఆపాలని కోరారు. ఇందుకోసం భారత ప్రభుత్వం తనవంతుగా కృషి చేయాలన్నారు. ఆదోని ఖాజీ సాబ్ అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ... యుద్ధం జరగడం వల్ల ఇప్పటికే వేలాదిమంది చిన్నారులు, పౌరులు మృతి చెందారని తెలిపారు. అక్కడి ఆస్తులు, వారి నివాసాలు సర్వనాశనమయ్యాయని చెప్పారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ... యుద్ధం జరగడం వల్ల అందరూ నష్టపోతారని, శాంతి ఉండేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. వినతిపత్రం విషయాన్ని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని చెప్పారు. ఆదోని ఖతిబ్ సాబ్ జునైద్ హాష్మి, పెద్ద మసీదు కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాష, నాయకులు ఎస్ఎంబి.హన్ను, బుద్ధారెడ్డి, రామచంద్ర, తిమ్మప్ప, ఆరెకల్ రామకృష్ణ, ఇస్మాయిల్, కన్నె జగదీష్, మనియర్ యూనుస్, నారాయణపురం షేక్షావలీ, మాజీ కౌన్సిలర్ షాషావలీ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, మతాల పెద్దలు

8న 'ఉపాధి' తనిఖీపై ప్రజావేదిక

- ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 8న గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ చట్టంపై సామాజిక తనిఖీ, ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఎపిఒ మహ్మద్ బాష తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా మండలంలోని పంచాయతీల్లో ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులకు 17వ విడత సామాజిక తనిఖీ బృందం వారు సామాజిక తనిఖీ చేశారని తెలిపారు. ఈ తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజా ప్రతినిధులతో ఈనెల 8న ప్రజా వేదిక నిర్వహించనున్నామని చెప్పారు. సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

9న మండల సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 9న గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి టి.నసరుద్దీన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ శనివారం తెలిపారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, వన్ టైం సెటిల్‌మెంట్ కార్యక్రమాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల పని పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

- డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాలో కొత్త పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలోని తిక్కస్వామి దర్గా ఏరియాలో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ ఉపాధ్యక్షులు వెంకటేష్ జెండాను ఆవిష్కరించారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ప్రభుత్వ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ నాయకులు రామానాయుడు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను వివరించాలి

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

వచ్చే ఎన్నికల్లో టిడిపి అందించే పథకాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం టిడిపి ఇన్‌ఛార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని నేల కోసిగి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేశ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి హాజరయి మాట్లాడారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున నగదు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, రైతులకు ఏటా రూ.20 వేలు, కుటుంబానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందించనున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, భరద్వాజ్ శెట్టి, నాడిగేని రంగన్న, పశువుల తిమ్మప్ప, మహాదేవ, వీరారెడ్డి, మారెప్ప, కొరివి గుండేష్, దుద్ది హనుమంతు పాల్గొన్నారు. **హోళగుంద**లోని బూత్ నెంబర్ 43లో టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య మాట్లాడారు. టౌన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, సీనియర్ నాయకులు గాదిలింగప్ప, టిడిపి మండల యూత్ నాయకులు మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.



కోసిగిలో ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం పాత తహశీల్దార్ కార్యాలయంలో సర్పంచి, ఉప సర్పంచి తోట సావిత్రి, శివారెడ్డి గౌడ్ ఆధ్వర్యంలో శనివారం వెంకటేశ్వర కంటి వైద్యశాల బృందంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగ వంశీ కృష్ణ, శివారెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం చిన్నపిల్లల నుంచి కంటి సమస్యలు వస్తున్నాయని, వాటిని త్వరగా గుర్తించి చికిత్స తీసుకుంటే మంచి కంటి చూపు ఉంటుందని తెలిపారు. లేకపోతే కంటిచూపులు కోల్పోయే అవకాశం ఉందన్నారు. డబ్బులు ఎక్కువ పెట్టి పరీక్షలు చేయించుకోలేని వారి కోసమే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 150 మందికి కంటి పరీక్షల చేశామని, అనంతరం సరిపడ మందులు కూడా అందించామని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

శభాష్ రమేష్.. దళిత జాతికే వన్నె తెచ్చావు

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు జానయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

సౌత్ జోన్‌లో జరిగిన కర్ర సాములో ప్రతిభ కనపరచి మొదట స్థానంలో నిలిచి చిక్కం రమేష్ శదళిత జాతికే వన్నె తెచ్చారని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ ప్రశంసించారు. శనివారం మండలంలోని వి.తిమ్మాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన చిక్కం ఆనంద్ రాజు పెద్ద కుమారుడు చిక్కం రమేష్ విజయవాడలో ఎఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కర్రసాములో ప్రతిభ కనబరిచి సౌత్ జోన్‌లో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. రమేష్‌కు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వి.తిమ్మాపురం నాయకులు మామిడి నాగేష్, చిక్కం బుజ్జయ్య, రామచిలకల జగన్, చిక్కం రోగన్న, చిక్కం ఆశీర్వాదం, రామచిలకల విజయ్ కుమార్, రామచిలుకల సుందర్ రాజ్, చిక్కం సదా, మామిడి వినోద్, రామచిలకల సంజీవ్, చిక్కం రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును విజయవంతం చేయండి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

స్పెషల్ సమ్మర్ రివిజన్-2024లో భాగంగా శని, ఆదివారాల్లో జరిగే ప్రత్యేక ఓటరు నమోదును విజయవంతం చేయాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సిల్వర్ జూబ్లీ హాలులో బిఎల్ఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బూత్ లెవల్‌లో ప్రతి బిఎల్ఒ ఫారం-6తో ఓటరు నమోదు జనవరి 1, 2024లోపు 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటు హక్కు గురించి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారినా వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలని సూచించారు. ఓటరు కార్డులో పేరు, వయస్సు, జెండర్, తప్పులు, అడ్రస్ మార్పులు, చేర్పులు ఉన్న వాటిని సంబంధిత పత్రాలను జత చేసి సమర్పించాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వీరశైవ లింగాయత్ కల్యాణ మండపం సమీపంలో ఉన్న పోలింగ్ కేంద్రం, హవన్నపేటలోని ఉర్దూ పాఠశాల, ప్రభుత్వ పాఠశాల, భారతి విద్యాసాధన స్కూల్, ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలించారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

NAME CHANGE

I AM KALURI DAIVARAM EX ARMY, No.1251583. Retd R/o.H.No. 76/97/372/5, NTR NAGER, KALLURU MANDAL KURNOOL - 518003, HEREBY DECLARE THAT MY Wife's Name Smt, MARIAMMA WANTS TO CHANGE HER NAME AS Smt, K.MARIYAMMA.Alias K.JEEVAMMA.ON RESIONS TO MAKE CORRECT ENTRIES IN MY SERVICE PENSION/CIVIL DOCUMENTS/PERMANENTLY.

IN THE COURT OF THE 2ND ADDITIONAL DISTRICT JUDGE :: ADONI
L.A 159/2023 in A.S No. /2023

Between:-
Y.M.Venkatesh ....Petitioner/Appellant
Vs
P.Ratna & others ....Respondents

To.
Respondent No :: 3. Surekha D/o late P.Lakshminarayana Reddy, Hindu, Major, R/o H.No 21/65, SKD Colony, 2nd Road Adoni
Respondent No :: 4 Saritha D/o late P.Lakshminarayana Reddy, Hindu, Major, R/o H.No 21/65, SKD Colony, 2nd Road Adoni
Respondent No :: 5 Krishna S/o late P.Lakshminarayana Reddy, Hindu, Major, R/o H.No 21/65, SKD Colony, 2nd Road Adoni

The above named petitioner/Appellant filed the above petition U/o 41 R 3A CPC to condone the delay of 36 days in preferring an appeal from 07.05.2023 to 13.06.2023 against the decree and judgment in O.S 17/4/2017 on the file of Pri Junior Civil Judge Adoni. The above case is posted to **24.11.2023** at 10.30A.M. & if any one got objections can appear before the above said court otherwise the matter will be decided exparte.

M.Sreedhar Reddy
M.Satyasri
Advocates for Petitioner/Appellant
Adoni Phone No 9441263921

కరువుపై వైసిపి నిర్లక్ష్యం...

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

కరువు కోరల్లో చిక్కి రైతులు విలవిల్లాడుతున్నా వైసిపి ప్రభుత్వం చొరవ చూపకుండా చోద్యం చూస్తోందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. శనివారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తున్నా కేబినెట్‌లో చర్చించకుండానే సమావేశం ముగించడం బాధాకరమన్నారు. కరువుపై చర్చించని కేబినెట్ సమావేశం ఎందుకని మండిపడ్డారు. కర్నూలు జిల్లాలో కరువుతో పనుల్లేక ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయన్న వార్తలు ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. వందేళ్లలో ఈ ఏడాదే అతి తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని, సహాయక చర్యలు చేపట్టకపోవడం భావ్యం కాదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించడంపై ఉన్న శ్రద్ధ కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడంలో లేదని మండిపడ్డారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, ముస్లిం, మైనార్టీ నాయకులు సాధిక్ వలీ, శ్రీనివాసులు, నరసప్ప, తిమ్మారెడ్డి, బాబురావు, భరత్ కుమార్, చిరంజీవి ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

విశ్వరూప మహాసభకు తరలి వెళ్దాం

- ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి గాదిలింగ

ప్రజాశక్తి - చిప్పగిరి

కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎబిసిడి వర్గీకరణ సాధన కోసం ఈనెల 11న హైదరాబాదులో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు తరలి వెళ్దామని ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి ముత్యాల గాదిలింగ కోరారు. శనివారం ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు జిఎస్.నెట్టికంటయ్య ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు డీలర్ రామయ్య, గాదిలింగ, నెట్టికంటయ్య మాట్లాడారు. ఎబిసిడి వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. మాదిగల సత్తా చూపడం కోసం విశ్వరూప మహాసభను ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్ నడిబొడ్డున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా హాజరవుతున్నారని చెప్పారు. ఎస్సీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు జిఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జెండావిష్కరణ చేస్తున్న హుస్సేన్ బాషా

ప్రజల ఐక్యతకు భంగంగా మతోన్మాదం

- యువత పోరాటాలకు సిద్ధం కావాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

దేశంలో బిజెపి మతోన్మాదం పేరుతో ప్రజల ఐక్యతకు భంగం కలిగిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, ప్రభుత్వరంగ వ్యవస్థలను ప్రైవేట్ పరం చేస్తూ దేశ అభివృద్ధిని కూల్చుతోందని డివైఎఫ్ ఐ నగర కార్యదర్శి ఎస్. హుసేన్ బాషా మండిపడ్డారు. శనివారం నగరంలోని 32వ వార్డ్ ముజఫర్ నగర్‌లో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా నగర అధ్యక్షులు వి.దినేష్, స్థానిక అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో ఎస్.హుసేన్ బాషా జెండావిష్కరణ చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం జరుగుతున్న మోడీ విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రధాని మోడీని ప్రశ్నించలేని స్థాయికి దిగజారారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యంత వెనకబడిన కర్నూలు జిల్లాలో ప్రాజెక్ట్‌లు పూర్తికాక, పంటలు పండక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పెరిగిన ధరలకు ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి సంవత్సరానికి జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగుల కలలను నీరుగార్చారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ పోరాటాలు సాగిస్తామన్నారు. పోరాటాలకు యువత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు సిహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప, వి.విజయ్ కుమార్, ఆంజనేయులు, ముక్తియార్, స్థానిక నాయకులు, సురేష్, శ్రీనివాసులు, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలు సక్రమంగా విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి - సి బెళగల్

బిఎల్ఒలు పోలింగ్ కేంద్రాలలో సక్రమంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. శనివారం బెళగల్‌లోని ఆయా పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఫారం–6,7,8ల పని తీరును పరిశీలించారు. ఈ ప్రక్రియను వేగం చేసి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

6, 7న ధర్నాలను జయప్రదం చేయండి

- ఎపి డప్పు కళాకారుల సంఘం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

దళితులైన డప్పు కళాకారులు పోరాడి సాధించుకున్న ప్రభుత్వ గుర్తింపు కార్డులను గతంలో లాగానే జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, భాషా సాంస్కృతిక శాఖ ద్వారానే ఇప్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6, 7 తేదీలలో అన్ని సచివాలయాల ముందు డప్పులతో జరిగే ధర్నాలలో డప్పు కళాకారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.ఆనంద్ బాబు, గుండిమెడ క్రాంతికుమార్‌లు శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. కుల అసమానతల కారణంగా దళితులను అంటరాని వాళ్ళుగా చూస్తూ దగా చేయడమే కాక, దళిత కళగా ఉన్న డప్పు కళను సైతం అంట రానిది గానే చూశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఎపి డప్పు కళాకారుల సంఘాన్ని ఏర్పాటు చేసి నిర్వహించిన పోరాట ఫలితంగా డప్పు కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రం విడిపోయాక విజయవాడ కేంద్రంగానే భాషా సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులను మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం నిధులను టూరిజం శాఖకు బదలాయిస్తూ రాష్ట్ర కార్యాలయం ద్వారా విజయవాడ నుండి గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తామనడం సరైంది కాదని, దీని ద్వారా నిరక్షరాస్యులైన దళిత డప్పు కళాకారులు గందరగోళానికి గురై అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పాత పద్ధతిలోనే జిల్లా కేంద్రాలలో భాషా సాంస్కృతిక శాఖ ద్వారానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల పెన్షన్లను పెంచుతూ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం డప్పు కళాకారులకు మాత్రం ప్రారంభంలో ఇచ్చిన పెన్షన్‌నే ఇస్తూ వస్తుందన్నారు. పెన్షన్ నమోదుకు ఇప్పటికీ అధికారులు ఇవ్వని డిజిటల్ సర్టిఫికెట్‌ను తెచ్చి ఇస్తేనే నమోదు చేస్తామంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగానే పెన్షన్‌కు నమోదు చేసుకోవాలని, డప్పు పెన్షన్ వయసును 45 సంవత్సరాలకు తగ్గించాలని, డప్పు కళాకారుల, చర్మకారుల పెన్షన్‌ను రూ. 5 వేలకు పెంచాలని, గుర్తింపు కార్డులను జిల్లా కేంద్రాల నుండే ఇవ్వాలని ఈ నెల 6, 7వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయ కేంద్రాల ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డప్పు కళాకారులందరినీ సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

రోగుల సహాయార్థం వాలంటీర్లు ఏర్పాటు

- బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిజిహెచ్‌లో హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక బుట్టా ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల సహాయార్థం హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించి 5 మంది సహాయకులను నియమిస్తూ వారి నియామక పత్రాలను హాస్పిటల్ సూపెరిండెంట్ వెంకట రంగారెడ్డికి శనివారం అందజేశారు. నేటి నుండి వారి సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. వారి జీత భత్యాలను తమ ఫౌండేషన్ ద్వారా అందచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ కర్నూలు హాస్పిటల్ ఎంతో సువిశాలమైనది కావున ఆసుపత్రిలో ఏ వార్డ్ ఎక్కడ ఉందో, ఏ పరీక్షలకు ఎక్కడికి వెళ్లాలో అర్థం గాని పరిస్థితి ఉందన్నారు. రోగులకు తక్షణ వైద్యం అందించే క్యాజువాలిటీ నుండి రోగిని పరీక్షకు తీసుకెళ్లాలంటే వారికి ఒకరి సహాయం తప్పక అవసరమన్న విషయం గ్రహించి తమ వంతు సామాజిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నలుగురు పురుషులు, ఒక మహిళా సహాయకురాలిని నియమిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో సేవలను మరింత పెంచుతామని తెలిపారు. మహిళా ప్రసూతి విభాగంలో కొన్ని కుర్చీల అవసరం ఉందని తెలిసిందని, వీలైనంత త్వరలో వాటిని అందించడానికి తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా బుట్టా ఫౌండషన్ వారు ఇలాంటి సేవలను అందించడం ఎంతో హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ సహకారాలను అందించాలని కోరారు.

6న కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుండి బాధితులు విచ్చేసి తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేసుకోవాలన్నారు.

7, 8 తేదీలలో సిపిఐ జిల్లా సమితి సమావేశాలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సిఆర్‌భవన్ (సిపిఐ కార్యాలయం)లో ఈ నెల 7న సిపిఐ జిల్లా కార్యవర్గం, 8వ తేదీ జిల్లా సమితి సమావేశం నాయకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో నెలకొన్న కరువు, కరువు సహాయక చర్యలు చేపట్టే దాంట్లో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి, పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, జిల్లా రాజకీయ పరిస్థితులపై ఈ చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు హాజరు కావాలని కోరారు.

పిజి కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్లు చేసుకోండి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2023–2024 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు శనివారం తెలిపారు. యూనివర్సిటీలో ఎం.ఎ.ఇంగ్లీష్, ఎం.ఎ. ఎకనామిక్స్, ఎం.ఎ.ఉర్దూ, ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్, ఎంఎస్‌సి బాటని, ఎంఎస్‌సి జువాలాజి, ఎంఎస్‌సి ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చన్నారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తమ సర్టిఫికెట్లను ఈ నెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు అప్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 13 నుండి 15లోగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ నెల 18న విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని, 20 నుండి 23లోగా యూనివర్సిటీలో రిపోర్ట్ చేయాలని, అదే రోజు తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి అంజిబాబు కార్మికులను కోరారు. శనివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ కార్మికులకు, రైతులకు వ్యతిరేకమైన విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. 384 రోజులు జరిగిన మహా రైతు ఉద్యమం సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లకీంపూరి ఖైరిలో ఆందోళన చేస్తున్న రైతులను చంపిన కేంద్ర మంత్రి కుమారున్ని వెంటనే శిక్షించాలన్నారు. కార్మిక చట్టాలను మారుస్తూ ఉరితాల్లుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరన్న, ప్రభాకర్, విజయ్, నారాయణ స్వామి, సాయిబాబా, నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసేవరకూ ఉద్యమం

- ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు

- కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం 8న విద్యా సంస్థల బంద్

ప్రజాశక్తి - పాణ్యం

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేట్ పరం చేయొద్దని నవంబర్ 8న జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి రఫీ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు బాలాజీలు కోరారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్లను శని వారం పాణ్యం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కును దశాబ్దాలకు పైగా ప్రభుత్వాలు శిలాఫలకాలకే పరిమితం చేశాయన్నారు. బ్రాహ్మణీ ఉక్కు పరిశ్రమ పేరుతో భారీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వం, తరువాత వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శంకుస్థానలు, నిర్మాణం పూర్తి చేస్తామని హామీలు మాత్రం ఇస్తూ, చేస్తూ వస్తున్నాయని, చివరికి, తక్కువ సామర్థ్యంతో పరిశ్రమను పూర్తి చేసేందుకు ఇప్పటి ప్రభుత్వం శంకస్థాపన చేసిందన్నారు. చదువుకున్న యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారని, ఇక్కడ నిర్మాణ దశలో ఆగిపోయిన గతంలోని భారీ పరిశ్రమనే పరిశ్రమ పూర్తతే ఇక్కడ అభివృద్ధి శరవేగంగా జరుగుతుండన్నారు. బిజెపి ప్రభుత్వం రాజకీయాలా కోసం కార్పొరేట్ వ్యక్తుల కోసం విశాఖ ఉక్కును బలి చేస్తున్నారని దీని తిప్పి కొట్టెందుకు రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్జహాన్, రాణి , లక్ష్మి, దితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభించాలని ఈ నెల 8న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బంద్ వాల్ పోస్టర్లును విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

7న రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైతు సమస్యలపై ఈ నెల 7న నిర్వహించే రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయాలని డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు కోరారు. శనివారం స్థానిక డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు గర్జన ర్యాలీ స్థానిక రాజ్‌విహార్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు చేపట్టి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు రఘువీరారెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. సమావేశంలో కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఆదోని నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్స్ దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠప్ప, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నూర్ అహ్మద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోతుల శేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు బాబురావు

సర్వ నరసింహ స్వామికి పూజలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలోని సిరివెళ్ల మండలం గాజుల పల్లె సమీపంలో ఉన్న సర్వ నరసింహ స్వామికి కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు.. శనివారం కావడంతో సర్వ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దేవస్థానం ఈవో నరసయ్య ఆలయ చైర్మన్ రామాంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేశారు.

భజన కృష్ణకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల పట్టణం నివాసి భజన కృష్ణయ్య భక్తులను భక్తి మార్గంలో నడిపించడంలో విశేష కృషి చేస్తున్నందున భజన కృష్ణయ్యకు హైదరాబా ద్‌కు చెందిన చిమ్మపూడి ఫౌండేషన్ వారు ప్రతిభా పురస్కారంను అందజేశారు. ఈ సందర్భంగా జీకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జే ఎస్ ఎస్ బ్రహ్మానందం ఆచారి మాట్లాడుతూ భజన కృష్ణయ్య ప్రజలను భక్తి మార్గంలో నడిపించడంలో ఈ పురస్కారం సత్కారం దక్కినట్లు వారన్నారు.

బాల ఆలయానికి ద్వారం ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని కొండమాయపల్లి పంచాయతీ వెలగలపల్లి గ్రామ పొలిమేరలో వెలిసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మాణంలో ఉన్న బాల ఆలయానికి ద్వారం ఏర్పాటు చేశారు. శనివారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు కుంకుమార్చన విశేష పూజలు జరిపించడం జరిగినది అలాగే దూర ప్రాంతం నుండి వచ్చినటువంటి భక్తులకు నంద్యాల వాస్తవ్యులు బబ్బురి వెంకట కష్ణయ్య దంపతులు అల్పాహారం ప్రసాదం ఏర్పాటు చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రంగనాయకులు, ట్రెజరరీ నరసింహులు , కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి ,రాజశేఖర్ రెడ్డి, కేశవరెడ్డి పలువురు భక్తులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ సిఎస్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్, బాల్య వివాహాల నివారణ, నాడు నేడు, జగనన్నకు చెబుదాం అంశాలపై వివిధ కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు ఏర్పాటు చేసిన కమిటీలను పటిష్టం చేసి అరికట్టేందుకు ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను మళ్ళీ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ, డివిఈఓ ను ఆదేశించారు. గుర్తించిన ఇంటర్ లో 2000 మంది విద్యార్థులు, టెన్త్ క్లాస్ లో 400 మంది విద్యార్థులను విద్యాసంస్థల్లో ఎన్రోల్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాడు నేడు కింద చేపట్టిన పాఠశాలల నిర్మాణ పనులు, అంగన్వాడి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి మాట్లాడారు. ఈ నెల 15 నుంచి చేపట్టే భారత సంకల్ప యాత్ర విజయవంతానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని సింగన పల్లె,చనుగొండ్ల గ్రామ సచివాలయాలను ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సచివాలయంలోని ఉద్యోగుల పనితీరు రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో ఆయన మాట్లాడు తూ సచివాలయానికి వచ్చే ప్రజల యొక్క సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం చేయకుండా ఏరోజు పని ఆరోజు పూర్తి చేసే విధంగా ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.

దేశెట్టి శ్రీనివాసులుకు జాతీయ పరమ గురూజీ అవార్డు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

విశాఖ పట్టణం చోడవరం చిత్రకళా నిలయం 6వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో విజేతగా నిలిచిన దేశెట్టి శ్రీనివాసులకు జాతీయ గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డు, పరమ గురూజీ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, నన్నయ తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మురు ముత్యాల నాయుడు నిర్వాహకులు బొడ్డేటి సూర్య నారాయణ, ఫారెస్ట్ రేంజర్ దేవి ప్రసాద్‌లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దేశెట్టి శ్రీనివాసరావు మాట్లా డుతూ ఈ అవార్డులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్ర పోటీలకు బిసి గురుకుల విద్యార్థులు

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పోటీల్లో సుండిపెంటలోని బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రధానాచార్యులు బి. జవహర్ మాట్లాడారు. అండర్–17లో వాలీబాల్‌లో ఎన్.వంశీ వర్ధన్, టెన్నికాయిట్‌లో కె.జస్వంత్, అండర్–14లో కబడ్డీలో ఎం.కార్తీక్, అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్‌లో మణి తేజ మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జి.రాధాకృష్ణను ప్రధానాచార్యులు, సిబ్బంది, సుధాకర్, తిమోతి తదితరులు అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం సెట్కూరు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్.సలీం భాష, ఎస్.సోహెల్ హాజరై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కావలసినటువంటి నైపుణ్యాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వ్యక్తిత్వ శిక్షణలో చెప్పిన అంశాలను శ్రద్ధగా విని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ దీపిక బుక్ లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రుతమ్మ, ముంతాజ్ బేగం, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కురువ చిన్న రాముడుపై హత్యాయత్నానికి పాల్పడిని వారిపై చర్యలు తీసుకోవాలి

- కురువ సంఘం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

గూడూరు మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన కురువ చిన్న రాముడిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కురువ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పత్తికొండ శ్రీనివాసులు, ఎంకె.రంగస్వామి డిమాండ్ చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న కురువ చిన్న రాముడిని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం పొలం తగాదా విషయమై పొలంలో పని చేసుకుంటున్న చిన్న రాముడుపై అదే గ్రామానికి చెందిన చిన్న సిద్ధయ్య కుమారుడు శ్రీధర్, వెంకటరాముడు కుమారుడు నాయుడు, పెద్ద వెంకన్న కుమారులు అడవి రాముడు, నాయుడు, చిన్న వెంకన్న కొడుకు సుధాకర్‌లు కలిసి దాడి చేసి ఎడమ చెయ్యి విరగొట్టారని ఆరోపించారు. గూడూరు మండలంలో కురవ కులస్తులపై దాడి ఇది రెండవదని, కావున అధికారులు దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గూడూరు మండల అధ్యక్షులు కె.కృష్ణ, జిల్లా నాయకులు బిసి.తిరుపాల్, తవుడు శ్రీనివాసులు, కేసి.నాగన్న, చిన్న గిడ్డయ్య, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

కురువ చిన్న రాముడును పరామర్శిస్తున్న సంఘం నాయకులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

రీ సర్వే వేగవంతానికి

పక్కా ప్రణాళిక

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్

- జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ అన్ని మండలాల తాసిల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో రీ సర్వే, ఆర్ఓఆర్ కేసులు, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ, పరాయీకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు, ఇనామ్ సర్వీస్ భూములు, తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు కచ్చితమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, సూక్ష్మ ప్రణాళిక సిద్ధం చేసుకోవడంతో పాటు ప్రతి రోజు ఏమేర రీ సర్వే పనులు పూర్తయ్యాయో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. బనగానపల్లి, అవుకు మండలాల్లో ఎందుకురీ సర్వే పనులు జరగడం లేదని కారణాలను వివరించాలని ఆర్డీవోను ఆదేశించారు. స్పందన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆర్ఓఆర్ పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న కేసులను విశ్లేషించి మండలాల వారీగా వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలని మండల తాసిల్దా ర్లను కలెక్టర్ ఆదేశించారు. సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు నిర్దేశించిన రీ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిశితంగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. సర్వే బృందాలు గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, స్టోన్ ప్లాంటేషన్ తదితర ప్రక్రియలను ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సిసిఎల్ఎ నుంచి ఎలా చేయాలో అన్ని కొన్ని ఆదేశాలు వచ్చాయని అందరికి పంపడం జరిగిందని అందరూ తహాశీల్దార్ వారి ప్రకారమే సర్వే పనులు చేయాలన్నారు. అన్ని మండల తహాశీల్దారు వచ్చిన టెంప్లేట్ ను కచ్చితంగా రిపోర్ట్స్ పంపాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్తున్నాయని పలుమార్లు సూచించినప్పటికీ సంబంధిత తాసిల్దారులు, వీఆర్వోలు అశ్రద్ధ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న గ్రామాల అవార్డ్సను పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత తాసిల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలోలో డిఆర్ఓ పుల్లయ్య, ఏడి సర్వే లాండ్స్, ఆర్డీవోలు, తహాశీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు పట్టాలు మంజూరు చేయాలి

జెసికి సిపిఎం వినతి



జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్లో సర్వే నెంబరు 489, 490, 495లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పేదలు గత 15 సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వెంటనే పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టనంలోని ప్యారడైస్ ఫంక్షన్ హాల్లో జాయింట్ కలెక్టర్కు సిపిఎం బృందం వినతిపత్రం అందజేసిది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలని జెసిని కోరారు. నందికొట్కూరు, జూపాడుబంగ్లాను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. నందికొట్కూర్, జూపాడుబంగ్లా మండలాల్లో వేలాది ఎకరాలు పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారని తెలిపారు. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. కౌలు రైతులు పంటలను మొత్తం దున్నేసి నష్టపోయారన్నారు. నష్టపోయిన సంఘటనలు మండల, జిల్లా స్థాయి అధికారులు సర్వే చేసినా జాబితాలో మాత్రం కరువు మండలాలుగా చేర్చలేదన్నారు. తక్షణమే నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువుగా ప్రకటించాలని, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులు పని కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.పకీరు సాహెబ్, టి.గోపాలకృష్ణ, సి.నాగన్న, డి.కుమార్, జయ రాణి, ఎస్.బాలయ్య, రాజు, నాగ శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర సక్సెస్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో విజయవంతంగా సాగింది. రెండు రోజుల పాటు జిల్లాలో బస్సు యాత్ర సాగింది. తొలి రోజు కర్నూలు జిల్లాలో, రెండో రోజు నంద్యాల జిల్లాలో బస్సు యాత్ర నిర్వహించారు. తొలి రోజు కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమైన యాత్ర ఆలూరు, పత్తికొండ, కోడుమూరు మీదుగా కర్నూలు వరకు సాగింది. కర్నూలులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. బస్సు యాత్రను సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే జెండా ఊపి ప్రారంభించారు. రెండో రోజు కర్నూలు నుండి ప్రారంభమైన బస్సు యాత్ర నందికొట్కూరు, ఆత్మకూరు, నంద్యాల మీదుగా కడప జిల్లాలోకి ప్రవేశించింది. బస్సు యాత్ర బృందానికి ఊరూరా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 15న విజయ వాడలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బస్సు యాత్ర బృందానికి పలువురు వినతి పత్రాలు సమర్పించారు. నందికొట్కూరు బిఆర్ఆర్ నందు కొట్టాలు వేసుకున్న గుడిసె వాసులకు పట్టాలు ఇప్పించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. మిడుతూరు మండలంలో భూమి పట్టాలు ఇచ్చారు కానీ భూములను చూపించాలని, నందికొట్కూరు మున్సిపాలిటీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. అంగన్వాడి, ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, డప్పు కళాకారులకు గుర్తింపు కార్డు, రూ.5వేల పింఛన్ ఇవ్వాలని వినతి పత్రాలు సమర్పించారు.

ప్రాజెక్టులలోకి చేరని నీరు..

జిల్లాలోని ప్రాజెక్టులలోకి వరద నీరు వచ్చి చేరడం లేదు. ఎగువన వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం జలాశయానికి చుక్క నీరు కూడా రావడం లేదు. అలాగే తుంగభద్ర జలాశయానికి కూడా ఎగువ నుండి నీరు వచ్చి చేరడం లేదు.

విద్యా రంగ సమస్యలపై...

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 8న విద్యా సంస్థల బంద్ చేపట్టనున్నారు. దీనికి సంబందించిన పోస్టర్లు, గోడ పత్రికలను విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఆయా సంఘాల నాయకులు సమావేశాలు నిర్వహించారు.

అవీ..ఇవీ..అన్నీ..

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. వాల్మీకికి నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో టీడీపీ ఆధ్వర్యంలో కళ్ళు తెరిపిద్దాం కార్యక్రమం చేపట్టారు. టీడీపీ, జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిం చారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం పట్ల టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం తక్కువ సంఖ్యలో కరువు మండలాలను ప్రకటించడంపై పలు సంఘాల నుండి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. కరువు మండలాలను పునః పరిశీలించాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

-10 మోటార్ సైకిల్లు స్వాధీనం - జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పలు జిల్లాలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ముద్దాయిని అరెస్ట్ చేసి వివిధ ప్రాంతాలలో దొంగలించిన 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె. రఘు వీర్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ కేసుకు సంబందించిన పలు విషయాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాలు మేరకు.. గత నెల సెప్టెంబర్ 15న ఆళ్లగడ్డ టౌన్ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న అపోలో మెడికల్ స్టోర్ ముందర చాగలమర్రికి చెందిన ముల్లా సర్తాజ్ నవాజ్ అను వ్యక్తి తన బైక్ పల్సర్ -150 దొంగలి ంచారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆళ్ళగడ్డ టౌన్ ఎస్ఐ దర్యాప్తు చేశారు. పోలీ సులకు వచ్చిన సమాచారం మేరకు ఆళ్లగడ్డ వెలు పల గల పివిఎస్ఆర్ గోడౌన్ దగ్గర ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రమేష్ బాబు ఆధ్వర్యములో ఎస్ఐ కేపీబి వెంకట రెడ్డి తన సిబ్బంది సహాయ ముతో ముద్దాయి షేక్ దస్తగిరిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి చోరి కాబడిన పల్సర్-150 బైక్ను, 9 మోటార్ సైకిల్లు కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూర్, మైదుకూర్, కడపలలో దొంగలించిన మోటార్ సైకిళ్లను పంచనామా ద్వార స్వాధీన పరుచుకు న్నట్లు ఎస్పి తెలిపారు. ముద్దాయిని రిమాండ్ నిమిత్తము కోర్టుకు పంపినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన సిబ్బంది ఎస్ఐ వెంకట రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్ళ కోటేశ్వర రావు, నాగరాజు కానిస్టేబుళ్లు బాలాజీ నాయ క్, మద్దిలేటి, లక్ష్మి నారాయణ హోంగార్డ్ ప్రసాదుల ను నంద్యాల జిల్లా ఎస్పీ అబినందిం చారు. ముద్దాయి కడప జిల్లా ప్రొద్దుటూర్ మండలము తాల్లమపురం గ్రామముకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

బిజెపి విధానాలను వ్యతిరేకించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రయివేట్, స్వచ్ఛంద సంస్థలకు ఐసిడిఎస్ పథకాలను అప్పగించే వినాశనకర విధానాలకు బిజెపి తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం అన్నారు. శనివారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో పిల్లలకు పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య, గర్భిణులు, బాలింతల అరోగ్యానికి ఐసిడిఎస్ పథకం అద్భుతమైన మేలు చేస్తుందన్నారు. ఐసిడిఎస్ ఏర్పడిన తర్వాత మాత మరణాలు, శిశు మరణాలు తగ్గించడంలో విశేష కషి జరిగిందన్నారు. ఐసిడిఎస్ను మరింత అభివృద్ధి చేయకపోగా బిజెపి ప్రభుత్వం ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలకు పథకాలను అప్పగించాలని చూడడం దుర్మార్గమన్నారు. బాలింతలు, గర్భిణుల కోసం సేవలంది స్తున్న అంగన్వాడీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ కోసం వారి కుటుంబాలు త్యాగం చేసి పెట్టుబడులు పెడుతున్న కానీ ప్రభుత్వం అంగన్ వాడీలను నిర్లక్ష్యంగా చూస్తుందన్నారు. అంగన్వా డీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. కార్యక్ర మంలో సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాలు మంజుల, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, విజయలక్ష్మి, వెంకట రమణమ్మ, శ్యామల, అరుణ, దర్గమ్మ, సావిత్రి, తులసమ్మ, కుమారి, హెల్పర్లు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శ్రీశైలం నియోజకవర్గానిక చెందిన 44 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.39లక్షల 43వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం అందజేశారు.

శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన 5మండలాల పరిధిలోని 44 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను నంద్యాల పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల తరు పున లబ్ధిదారుల తరుపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించి భరోసాకల్పించారన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జె లక్ష్మి నరసింహ యాదవ్

రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి

- డిసిసి అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ యాదవ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈనెల 7వ తేదీన కర్నూలులో జరుగు రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయాలని డిసిసి అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు గర్జన ర్యాలీకి ముఖ్య అతిథులుగా సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరా రెడ్డి, ఎపి రథసారథి పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్ హాజరువుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో రాక్షస పాలన జరుగుతోందన్నారు. బిజెపి, వైసిపిల పాలనలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. వర్షాలు లేక పంటలు సరిగా లేక, అన్నదాత ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ పాలకులకు కరువు కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు జిల్లాల్లో నంద్యాల జిల్లాలో కేవలం 6 మండలాలుగా ప్రకటించడం విడ్డూరమన్నారు. ఈ పాలకుల దాష్టికాన్ని ఎండగట్టడానికి ఈ నెల 7న రైతు పోరు గర్జనకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అందరూ వేలాదిగా తరలివచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ హాబీబ్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు నాగలింగం, నంద్యాల నియోజకవర్గం కో ఆర్డినేషన్ సభ్యులు ఫరూక్, సేవాదళ్ మహిళ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి, శ్రీశైలం కోఆర్డినేషన్ సభ్యులు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులబండి పై నుండి పడి రైతు మృతి

ప్రజాశక్తి -ప్యాపిలి

పుట్టా సుంకప్ప (ఫైల్)

ప్యాపిలిలో ఎద్దులబండి పై నుండి రైతు కింద పడి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. ప్యాపిలికి చెందిన రైతు పుట్టా చిన్న సుంకప్ప(63) రోజువారి పనుల్లో భాగంగా పొలానికి ఎద్దుల బండిపై వెళ్లాడు. పత్తి సంచులను ఎడ్ల బండి మీద తీసుకొని ఇంటికి వస్తుండగా జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మాట్లాడుతున్న ఎంపిపి, చిత్రంలో ఎంపిడిఒ

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి - పాములపాడు

అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని ఎంపిపి సరోజినీ వర్ధినియా, ఎంపిడిఒ గోపికృష్ణ అన్నారు. శనివారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు. గత మూడు నెలల ప్రగతి నివేదికను మండల స్థాయి అధికారులు చదివి వినిపించారు. వైస్ ఎంపిపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భానుముక్కల సచివాలయం నిర్మాణ బిల్లులు మూడు లక్షలు ఖర్చు పెడితే పంచాయతీ రాజ్ జెఇ 1 లక్ష 50 వేల రూపాయలు మాత్రమే పెట్టాడని తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. సర్వే నెంబర్ 95/సీ లో పొలం కోర్టులో ఉండగా పంటలు ఎలా వేస్తారని రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు. ఇదే సర్వే నెంబర్లో పేద ప్రజలకు జగనన్న కాలనీకి భానుముక్కల గ్రామానికి ఇవ్వాలని అడిగితే రెవిన్యూ అధికారులు కోర్టులో ఉందని చెప్పారని, ఇప్పుడు ఎలా పంటలు వేస్తున్నారని ప్రశ్నించారు. ఎర్రగుడూరు సర్పంచి మంగమ్మ బాయ్ మాట్లాడుతూ గ్రామానికి గత నాలుగు రోజుల నుండి తాగునీరు రావడంలేదని, తాగునీటి సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ సర్వే నంబర్ 95లో సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయం బిల్లులపై సంబంధిత అధికారితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు నాయుడు, ఎంపీటీసీలు దర్గా భాయ్, అరుణ, సర్పంచులు నాయిని సావిత్రమ్మ, చంద్రారెడ్డి, వరప్రసాద్, మండల స్థాయి అధికారులు ఏపిఎం అనురాధ, వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి, ఎంఈఓ బాలాజీ నాయక్, ఆర్ఐ సుజాత బాయ్, పశువైద్యాధికారి భాస్కరు, ఆయుర్వేదిక్ అధికారి సావిత్రి, ఆర్డబ్ల్యూస్ జేఈ జుబేర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎపి నీటి హక్కులు తాకట్టు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల

బిజెపి తెలంగాణ ఎన్నికలలో లబ్ది పొందడానికి, ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను తాకట్టు పెట్టిందని కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చీకటి చట్టం - ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, ప్రస్తుత కరువు పరిస్థితులపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ఆద్వర్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో శనివారం ఉదయం జరిగింది. ఈ కార్యక్ర మానికి సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నోటిఫికేషన్ ద్వారా బిజెపి తెలంగాణ ఎన్నికలలో లబ్ది పొందడానికి, ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను తాకట్టు పెట్టిందని తీవ్రంగా విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి తన రాజకీయ లబ్ధికోసం మౌనంగా ఉంటున్నారని విమర్శించారు. ఈ చట్టంను రద్దు చేయడానికి విజయవాడ కేంద్రంగా 30 గంటల దీక్ష నవంబర్ 14, 15 చేపట్టామని, ఈ దీక్షలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు విలయ తాండవం చేస్తుంటే, క్యాబినెట్ సమావేశంలో కనీసం ఈ అంశంపై చర్చ చేయకపోవడం పాలకులకు వ్యవసాయ రంగం పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియచేస్తుందని విమర్శించారు. తబొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధుల ప్రకటనలతో రాయలసీమ ప్రాంతంలో రైతాంగం మిరప, వరి తదితర పంటలు వేసుకొని, నేడు నీరందకు ఈ పంటలన్నీ దున్ని వేసే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలోని రైతాంగం వేసిన అన్ని పంటలకు ఈ క్రాపింగ్ ద్వారా పంటల బీమా కింద పూర్తి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోపై, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్రమైన కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా రైతు నాయకులు, సిపిఐ నాయకులు రంగ నాయకులు, రంగం ముని నాయుడు, బాబాఫకృద్దీన్, రాయలసీమ సాగు నీటి సాధన సమితి ఉపాధ్యక్షులు ఏర్వ రామచంద్రా రెడ్డి, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, పౌర సంబంధాల కార్యదర్శి సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అదనపు బస్సు సౌకర్యం కల్పించాలి : బిఎస్పి

ప్రజాశక్తి - పాములపాడు

విద్యార్థులకు అదనపు బస్సు సౌకర్యం కల్పించి సరైన సమయానికి నడపాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పాములపాడులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భ ంగా బిఎస్పి తాలూకా ఇన్చార్జి ఎల్ స్వాములు మాట్లాడుతూ మండలంలోని మద్దూరు, పెంచికలపల్లె, కృష్ణానగర్, మిట్టకందాల గ్రామాల విద్యార్థులు పాములపాడు మోడల్ కాలేజీ, స్కూలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆత్మకూరు ఐటిఐ కాలేజీలకు, వెంకటేశ్వ ర డిగ్రీ కాలేజీలకు దాదాపుగా 150 మంది బస్సు పాసులు తీసుకుంటే ఒకే బస్సు నడుపుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కొంతమంది డ్రైవర్లు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మధ్యలోనే బస్సును ఆపుతున్నారని, మోడల్ కాలేజీ స్కూలు సాయంత్రం నాలుగు గంటలకు వదిలితే బస్సు మాత్రం 4:45 నిమిషాలకు వస్తుందని, విద్యార్థులు నిలబడలేక మోటార్ సైకిల్పై, ఆటోలపై వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఈ విషయాలపై దాదాపు ఎన్నో రోజుల నుండి స్పందనలో కలెక్టర్కి ఫిర్యాదు చేసినా కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఆర్టీసీ అధికారులు రూట్ ఆఫీసర్లు పంపి విచారించి అదనపు బస్సును కల్పించి సమయానికి తిప్పాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆర్టీసీ డిపోను ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

పాఠశాలలో గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

10న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

- జెవివి జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ లతీఫ్

ప్రజాశక్తి - ప్యాపిలి

ఈ నెల 10న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ లతీఫ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. శనివారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ గోడ పత్రికలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం, కస్తూరిబా గాంధీ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులలో పోటీతత్వం, శాస్త్రీయ అవగాహన, శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని అన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్లో ఎక్కువమంది విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. ఇప్పటికే డిఇఒ హెచ్ఎంలకు సూచనలిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మాబాయి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు శాంతి ప్రియ, మండల సహాధ్యక్షులు రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు నెల్లూరప్ప, శాంతి కుమార్, సుదర్శన్ రెడ్డి, రాజేంద్ర, కళ్యాణి, సత్యనారాయణ, సునంద, జయలక్ష్మీ, వనజ, పార్వతి, సునీత, శేఖర్, మాదన్న, రమేష్, కస్తూరిబా ఉపాధ్యాయులు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిఎస్సి తృతీయ సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత ఆదేశాల మేరకు జంతు శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గార్గేయపురంలోని కోళ్ల పరిశ్రమను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జంతుశాస్త్ర ఉపన్యాసకులు రామకృష్ణయ్య కోళ్ల పరిశ్రమ ప్రయోజనాలు, కోళ్లకు వచ్చే వ్యాధులు, దానా విషయాలను విద్యార్థులకు వివరించారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి తలపెట్టిన చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి ఇంటి ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆళ్లగడ్డ పట్టణంలో ఈనెల 7వ తేదీన నిర్వహించే బస్సు యాత్రపై మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్రానికి సీఎం జగన్ మరోసారి ఎందుకు కావాలో వివరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైకాపా బస్సు యాత్ర విజయవంతం చేసి ఆళ్లగడ్డ వైకాపా అడ్డా అని నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ర హర్ష వర్ధన్ రెడ్డి, జెడ్పిటిసి కసిని పుణ్య లక్ష్మి దేవితో పాటు మండలంలోని వివిధ నాయకులు, సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

సచివాలయాన్ని తనిఖీ చేసిన చైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని కొండపేటలోని ఏడవ సచివాలయంలో జరుగు తున్న పనులను సేవలను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మున్సిపల్, కమిషనర్ వెంకటరామిరెడ్డి శనివారం పర్యవేక్షించారు. సచివాలయ సేవలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన సచివాలయాలలో ప్రజల కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు.

ఓటు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో ఓటర్లు నమోదు సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్ అన్నారు. శనివారం తుమ్మలపెంట గ్రామంలో ఓటర్ జాబితాలో సవరణ మార్పులు చేర్పులు ఓటరు జాబితాను తాహసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు కొరకు ఫారం 6 బిల్వోలకు సమర్పించిలన్నారు. గ్రామాల్లో బిఎల్వోలు అందుబాటులో ఉంటారని ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదో సరి చూసుకోవాలన్నారు. అభ్యంతరాలు ఉంటే ఫారం 7,8 రాతపూర్వకంగా బిఎల్వోలకు సమర్పించాలన్నారు.

'గడప గడప'లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో శనివారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అనేక సమస్యలను నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ దృష్టికి తెచ్చారు. గ్రామంలో గత మూడు నెలల నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. రేషన్ షాపులో బియ్యం ఎందుకు సక్రమంగా సరఫరా చేయడం లేదని ఎమ్మెల్యే డీలర్లను ప్రశ్నించారు. గోదాం నుంచి బియ్యం చాలా తక్కువ వస్తున్నాయని, అందువల్లనే సరఫరా చేయలేకపోతున్నామని తహశీల్దార్కు విన్నవించినా పట్టించుకోవడం లేదని డీలర్లు సమాధానమిచ్చారు. డీలర్ ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని తహశీల్దార్ భారతిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. కనీసం ఉన్నతాధికారులకైనా ఫిర్యాదు చేశారా అని తహశీల్దార్ను ప్రశ్నించారు. తక్షణమే ఫోన్ ద్వారా జెసికి ఎమ్మెల్యే సమస్యను వివరించారు. బిసి కాలనీ దేవుని మాన్యం సమీపాన ఉన్న ఇండ్లకు నీటి కుళాయిలు, విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఆర్డబ్ల్యుఎస్ ఏఈ శివకుమార్ను పిలిచి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ ఏఇ క్రాంతి కుమార్ను పిలిచి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు చదువు సామర్థ్యాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం-1లో విద్యార్థులకు అందించే భోజనాన్ని ఆయన రుచి చూశారు. సాంబారును ఒట్టినీళ్లతో, కారంగా ఉందని, పిల్లలు ఎలా తింటారని అంగన్వాడీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువైద్యశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు, రైతులు, విద్యార్థుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ఓటు వేసి ఆశీర్వదించి సిఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, జెడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మద్దిలేటి, ఎంపిడిఒ వెంకటరమణ, ఎంఇఒ సుభాన్, నందికొట్కూరు రూరల్ సిఐ విజయభాస్కర్, ఎస్సైలు నాగార్జున, వెంకట సుబ్బయ్య, పిఆర్ ఎఇ వెంకటేశ్వర్లు, ఎపిఎం మద్దిలేటి, ఎపిఒ శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్ర రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్థర్

చిన్న కంబలూరు విద్యార్థి సిఎలో ఉత్తీర్ణత

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన విద్యార్థి జంగా కాశిరెడ్డి సిఎలో ఉత్తీర్ణత సాధించారు. గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు జంగా పెద్ద పుల్లారెడ్డి మనవడు, జంగా వెంకటేశ్వరరెడ్డి, జంగా గీతాలక్ష్మి గార్ల కుమారుడు కాశిరెడ్డి హైదరాబాద్లో చార్టెడ్ అకౌంట్ (సిఏ)లో ఉత్తీర్ణత సాధించడంతో ఉత్తీర్ణత పత్రాన్ని తల్లిదండ్రులతో పాటు అందుకున్నారు. కాశిరెడ్డి సిఎలో ఉత్తీర్ణత సాధించడం పట్ల పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థిని అభినందించారు.

జంగా కాశిరెడ్డి తమ తల్లిదండ్రులు వెంకటేశ్వర్ రెడ్డి గీతా లక్ష్మీలతో ఉత్తీర్ణత పత్రాలు చూపుతున్న దృశ్యం

విద్యుత్ షాక్తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అవుకు

మృతుడి ఫైల్ ఫోటో

అవుకు పట్టణానికి చెందిన తెలుగు పుల్లయ్య (35) విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తెలుగు పుల్లయ్య ఉదయాన్నే తన నూతన ఇంటి నిర్మాణ పనుల్లో గోడలకు పైపు ద్వారా నీళ్లను చల్లుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం తరలించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు నారాయణ తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని సింగన పల్లె గ్రామానికి చెందిన ఈడిగ వెంకట శివుడు నాటు సారా అమ్ముతుండగా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్సై విష్ణు నారాయణ మాట్లాడుతూ ఇంటి వద్ద సారా విక్రయిస్తున్నారని సమాచారంతో దాడి చేయగా అతని వద్ద ఉన్న పది లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వనభోజన కరపత్రాల విడుదల

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం కార్తీక వనభోజనం కరపత్రాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం విడుదల చేశారు. కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదిన నంద్యాల రోడ్డులోని బ్రహ్మంగారి నేలమటంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. ఈ కరపత్రాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సురేష్ నాయకులు శివరాం, నాగరాజు, కనకాద్రిపల్లె దస్తగిరి, నాగభూషణం, రఘురాముడు,శివయ్య,మహేష్, సుబ్బయ్య, రవి, శివరాంకిట్టు, జయచంద్ర, నాగేంద్ర,బాస్కర్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సత్తా చాటిన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు అనంత కళాశాల విద్యార్థి

పోటీలకు ఎంపికైన విద్యార్థినితో అనంత రామ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అనంత జూనియర్ కళాశాల విద్యార్థిని జయశ్రీ రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయిందని అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత నెల 26న ఎస్జిఎఫ్ స్కూల్ గేమ్స్ పోటీలలో అండర్ 17 విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో జయశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింద న్నారు. ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత రామ సుబ్బారెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ విజయలక్ష్మి విద్యార్థిని జయశ్రీని అభినందించారు. రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ సాధించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థి విజయానికి కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరమణను వారు అభినందించారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన బాల అకాడమీ విద్యార్థి

బహుమతి సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

నంద్యాల : గత నెల అక్టోబర్ 11వ తేదీన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాలు ఉమ్మడి గా"మన సంస్కృతి"కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి తెలుగు ప్రతిభా పరీక్షల పోటీల్లో బాల అకాడమీ రవీంద్ర హై స్కూల్ నుండి తొమ్మిదవ తరగతి చదువు తున్న ఎస్.అఫియా రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభ పరీక్షలలో స్టేట్ 2వ ర్యాంకును సాధించింది. హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ (హైదరాబాద్) నందు ఈనెల 2వ తేదీన తెలంగాణ సారస్వత పరిషత్ అధికారులు బహుమతులు, ప్రశంసా పత్రమును నగదు బహుమతిని ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన తమ పాఠశాల విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ ఎం. జి.వి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీ లత అభినందించారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటి బాస్కెట్ బాల్ పోటీకు ఆర్జీయమ్ విద్యార్థులు

పాణ్యం : కేరళలోని త్రివేండ్రంలోని కేరళ యూనివర్సిటీలో నవంబర్ 13 నుండి 18 వరకు సౌత్ జోన్ స్థాయిలో జరిగే బాస్కెట్బాల్ ఛాంపియన్ షిప్లో పురుషుల, మహిళల విభాగంలో పాల్గొనే జేఎన్టీయూ యూనివర్సిటీ జట్టులో ఆర్జీయమ్ చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. జయచంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల3న మోహన్ బాబు యూనివర్సిటీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి యూని వర్సిటీ బాస్కెట్బాల్ జుట్టుకు పురుషుల విభాగంలో ఎంపికైన వరుణ్ కుమార్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి మహిళల విభాగంలో ఎంపికైన నందిని రెడ్డి,కుందన రెడ్డి ఆయన అభినందించారు.అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జేఎన్టీయూ కి, ఆర్జీయమ్ కళాశాల కు పేరు తేవాలని అన్నారు. అలాగే ఇందుకు కషి చేసిన ఆర్జీయమ్ కళాశాల డైరెక్టర్ (స్పోర్ట్స్)వెంకటేశ్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర నాయక్, ఆర్జీయమ్ స్పోర్ట్స్ క్లబ్ స్టూడెంట్ కో ఆర్డినేటర్ మారుతి లను ప్రశంసించారు.

డోన్ను కరువు మండలంగా ప్రకటించాలి : సిపిఎం

బేతంచెర్ల సర్కిల్లో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-డోన్

డోన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బేతంచర్ల రోడ్డు సర్కిల్లో డోన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, రైతు సంఘం మండల కార్యదర్శి నాగ మద్దయ్య,మండల కమిటీ సభ్యులు,రామాంజనేయులు, నాగన్నలు మాట్లాడారు. నిత్యం కరువుతో అల్లాడే మెట్ట ప్రాంతాలనే కరువు మండలాలుగా ప్రకటించకపోవడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. సకాలంలో వర్షాలు కురవక వేసిన పంటలు చేతికి అందక రైతులు నష్టపోతుంటే నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నిర్లక్ష్యంతోనే కరువు మండలాల జాబితాలో డోన్, ప్యాపిలి మండలాలు లేకపోయా యన్నారు. తక్షణమే డోన్, ప్యాపిలి రెండు మండలాలను కరువు మండలా లుగా ప్రకటించక పోతే ఉద్యమాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జడ్పి చైర్మన్ పాపిరెడ్డి

పేదలందరికీ వైద్యం : జడ్పి చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

పేదలందరికీ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శనివారం కొలిమిగుండ్ల మండలంలోని గోర్వి మానుపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కర్నూలు నంద్యాల ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, వైసిపి జిల్లా నాయకల పేరం సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ జీవి ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, ఎంపిటీసీ పులి ప్రకాష్ రెడ్డి, బివి జగన్ సత్తిగాడు, రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పి చైర్మన్ వైస్సార్ కంటివెలుగు సంబంధించి కంటి సమస్య ఉన్నవారికి కళ్లద్దాలు పంపిణి చేసి, స్టాల్ను పరిశీలించారు. **బనగానపల్లె :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేద ప్రజల వద్దకే వైద్య సేవలను అందుతున్నాయని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని నందివర్గం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, కుర్ని కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్యామలాదేవి, ఎంపీడీవో శివరామయ్యలు ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో 1015 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి సుభాషిణి, వైసీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

జాతీయ స్థాయి పోటీలకు ఎస్డిఆర్ విద్యార్థి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎస్డిఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజ్ విద్యార్థి ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఆకాంక్ష జూనియర్ కాలేజ్లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి జూని యర్ కాలేజ్ చైర్మన్ శనివారపు కొండారెడ్డి ప్రిన్సిపల్ విజయ శేఖర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలలో మధు రమేష్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ బాస్కెట్బాల్ జట్టుకు ఎంపికయ్యార న్నారు. ఎంపికైనందుకు ఉత్తమ శిక్షణ ఇచ్చినటువంటి కాలేజ్ కోచ్ ముక్కమల్ల నవీన్ కుమార్గారిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఇంకా ముమ్ముందు అనేక మంది క్రీడాకారులు తమ కళాశాల నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని అందుకు తగినటువంటి శిక్షణ ఇవ్వాలని కోచ్ ముక్క మల్ల నవీన్ కుమార్గిని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల బాస్కెట్బాల్ కోచ్ ముక్క మాలనవీన్ పాల్గొన్నారు.

టిడిపిని ఆదరించండి : మాండ్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ చంద్రబాబుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని ఆ పార్టీ నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి ప్రజలను కోరారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని 3వ వార్డులో ఇంచార్జ్ సత్తార్మియా ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. మేనిఫెస్టోను తప్పకుండా అమలు పరుస్తామని, టిడిపిని అందరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జయ సూర్య, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, షకీల్ అహ్మద్, ముత్తుజావలి, లాయర్ జాకీర్ హుస్సేన్, ఎస్ఎండి జమీల్, రసూల్ ఖాన్, సత్తార్మియా, గంజాయి నాగమణి, కళాకారు, నిమ్మకాయల మోహన్, రాజు, బొల్లెద్దుల రాజన్న, ప్రభు కుమార్, సురేష్, ప్రవీణ్, పైజుల్లా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వ యంతో పని చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచిం చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాడు ఎంపీపీ నాగ మద్దమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు శాఖల అంశాల పై చర్చ జరిగిన అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతికి జానాభా ప్రాతి పదికన నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. దురదృష్టవశాత్తు తుంగభద్ర డ్యాంలో నీళ్ల లేకపోవడం వల్ల కాలువలలో నీరు లేని పరిస్థితి ఏర్పడిందని కేసీ కెనాల్లో వచ్చే నీళ్లను రైతులు పొలాలకు ఎంత అవసరం ఉందో అంతవరకే వాడుకోవాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో గ్రామాల్లో సమస్యలను గుర్తించి ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులకు ఉందన్నారు. మండలంలో కొర్రపోలురు గ్రామం సమీపంలో 220 కెవి విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణం కొరకు భూసేకరణ పూర్తి చేసి ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తే త్వరలోనే టెండర్కు పిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, ఈఓఆర్డి కాళీ బాష, అన్ని శాఖలు మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-డోన్

గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

అమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రంగ నాయకులు కోరారు. శనివారం డోన్ పట్టణంలోని స్థానిక వ్యవసాయ కార్యాలయం ఆవరణంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యవర్గ సభ్యుడు కె రంగనాయకులు మాట్లాడుతూ అమరవీరుల సంస్కరణ సభ బొల్లవరం గ్రామం ఈనెల 6 తేదీన, వేంపెంట గ్రామం నందు చంద్ర పుల్లారెడ్డి 9 తేదీన బహిరంగ సభ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ బహిరంగ సభకు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరైతారని తెలిపారు. జనం కొరకు తన చివరి శ్వాస వరకు పోరాడిన అనేకమంది విప్లవవీరులు పేద ప్రజల రాజ్యంకై ప్రభుత్వం చేత హత్యగావించబడ్డారని వీరందరికీ సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విప్లవ జోహార్లు అర్పిస్తూ అమరవీరుల ఆశయ సాధనలో ముందుకు తీసుకువెల్లుతుందని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా నాయకుడు దొరపల్లి రాజు, ఐఎఫ్టియు నాయకులు మునీంద్ర, పిఓడబ్ల్యూ నాయకురాలు మల్లిక, శ్రీరాములు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్నాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా లబ్ధిదారులందరికీ నవరత్నాల ద్వారా 100 శాతం అందుతోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కరి మద్దెల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆర్బికె పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి పథకాలను లబ్ధిదారులకు వివరించారు. వైసీపీ ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకో వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీవో మల్లీశ్వరప్ప, తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ నాగమద్దమ్మ, జెడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్.బి.కె పుల్లయ్య, డాలు స్వామి, మండల వైసిపి అధ్యక్షుడు ఎల్లంపల్లి శివరాంరెడ్డి, ఎల్లారెడ్డి, గని ఆనంద్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


బుక్లెట్ను అందజేస్తున్న ఎమ్మెల్యే

మద్దిలేటి స్వామి ఆలయ ఆదాయం రూ.8.13 లక్షలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి తలనీలాలు, మొక్కుబడులు, రూము బాడుగల తదితర వాటి వల్ల రూ.8,13,875 ఆదాయం వచ్చినట్లు ఆలయం ఈవో డి పాండురంగారెడ్డి, చైర్మన్ సీతా రామ చంద్రుడు శనివారం తెలిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు భారులు తీరారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో రూ.2 కోట్ల సొంత నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను శ్రీశైలం నియోజవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాతి నంది విగ్రహం వద్ద అభివృద్ధి పనులను, ఆలయ పరిసరాలు పరిశీలించి, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే శివరాత్రికి పుణ్యక్షేత్రంను సుందరీకరించి భక్తులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. టీటీడీ దేవస్థానం వారు ఇచ్చిన రూ.నాలుగు కోట్ల 60 లక్షల వ్యయం తో వసతి గదుల పనులు శరవేగంగా జరుగుతు న్నాయన్నారు. భక్తుల కోసం వసతి గృహాలు, కళ్యాణ మండపాలు నిర్మించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి,ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు,వైసీపీ నాయకులు భూమా సుబ్బరామయ్య,గజ్జ పెద్దపక్కీ రయ్య, సామి రెడ్డి,ఆలయ సిబ్బంది, వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట : జెసి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పెద్ద పీట వేసిందని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన దేశి శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రతి డీలర్ రైతులకు సకాలంలో పంటలపై సలహాలు, సూచనలు ఇచ్చి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దేశి ప్రోగ్రాం ద్వారా డీలర్లకు అవగాహన కల్పించి తర్వాత వీరి ద్వారా రైతులకు వేసుకున్న పంటలకు ఏ మందులు వేసుకోవాలో వాటి గురించి క్షుణ్ణంగా శాస్త్రవేత్తలు వివరించిన విధంగా తెలపాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు పిడి వరలక్ష్మి, మోహన్ రావు, ఏడిఏ విజయ శేఖర్, వెంకటేశ్వర్లు, రామకృష్ణారావు, మంజునాథ, సుధాకర్, మధుమతి, పీర్ నాయక్, షేక్షావలి, గుజ్జల గౌరీశ్వర నాయుడు, డీలర్లు పాల్గొన్నారు.

పంటలు పూర్తిగా ఎండిపోయాయి

- జిల్లా వ్యవసాయ అధికారికి రైతుల ఆవేదన

ప్రజాశక్తి - మిడుతూరు

వర్షాభావం వల్ల మొక్కజొన్న, పత్తి, మినుము, కంది పంటలు పూర్తిగా ఎండిపోయాయని మిడుతూరు మండల రైతులు జిల్లా వ్యవసాయ అధికారి ఎండిపోయిన పంటలను చూపించారు. శనివారం మండలంలోని మిడుతూరు, వీపనగండ్ల గ్రామాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయిన మొక్కజొన్న, పత్తి, మినుము, కంది పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి టి.మోహన్ రావు, జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణ రావులు పరిశీలించారు. అనంతరం వారు రైతులతో ముఖాముఖి చర్చించారు. రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న, పత్తి, మినుము, కంది పంటలు పూర్తిగా ఎండిపోయాయని, తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ పంటల నష్టంపై నివేది కలు ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో నందికొట్కూరు వ్యవసాయ సహాయ సం చాలకులు సి.విజయ శేఖర్, ఆర్బికె, విఎఎస్లు టి.అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి